క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గంపలగూడెం: గంపలగూడెం-1 సచివాయం పరిధిలో రెండో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటలనుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. సచివాలయం పరిధిలోని రా మ్మోహన్‌సెంటర్ నుంచి మెయిన్ బజారులో పార్థసారథి హోటల్ సెంటర్ వరకు, అక్కడ నుంచి కుమ్మరబజారు, పాత ఆయిల్‌మిల్ మీ దుగా షిర్డీసాయిబాబా ధ్యానని లయం వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గంపలగూడెం: గంపలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో తప్పక హాజరు కావాలని కోరారు.

18న ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు. అధికారులంతా ఆయా శాఖలకు సమగ్ర సమాచారంతో పాల్గొనాలని పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ



మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో సోమవారం దాత చామల సతీష్ రెడ్డి సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ బాటసారులకు దప్పిక తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తన వంతు సేవా కార్యక్రమంలో భాగంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి, ఆలమూరి చంద్రశేఖరరావు, ఐనీడ్స్ పుల్లారెడ్డి, శివ, మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రెడ్డిగూడెం: మండలంలోని కొత్తనాగులూరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లి పెసర పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్ సురేష్ తెలిపారు. నాగులూరు రైతు భరోసా కేంద్రంతో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వచ్చేటప్పుడు రైతు ఆధార్, ఫోన్ నంబర్ తీసుకుని రావాలని పేర్కొన్నారు. పొలం ఉన్న రైతులకు మాత్రమే ఈ విత్తానాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదగన నాగబాబు, గ్రామ ఉద్యాన సహాయకులు ఆర్ శేషు పాల్గొన్నారు.

4,826 స్కూలు బ్యాగుల సరఫరా



గంపలగూడెం: జగనన్న విద్యాకానుక నాల్గవ ఫేజ్ పంపిణీలో భాగంగా మండలంలోని 73 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 4,826 బ్యాగులను ఉన్నతాధికారులు సోమవారం సరఫరా చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్లో వాటిని దిగుమతి చేసుకున్నట్లు ఎంఈఓ సోమశేఖర్ నాయక్ పేర్కొన్నారు. విద్యార్థుల తరగతులను బట్టి మూడు రకాల సైజుల బ్యాగులు సరఫరా అయ్యా యని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకా లు, నోట్స్‌లు, బ్యాగు, మూడు జతల యూని ఫామ్, బూట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం జమలయ్య, ఎంఐఎస్ శ్రీను, సీఆర్పీలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మైలవరం: మండలంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు పంచాయతీ కార్మికులు సోమవారం ముమ్మరంగా చేపట్టారు. ఆయా గ్రామాల్లో డ్రైయినేజీల్లో పూడిక తీత పనులు, రోడ్లపై చెత్తా చెదారం తొలగింపు పనులు చేపట్టారు. వెల్వడంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు దగ్గర ఉండి పనులు పర్యవేక్షించారు.

నవరత్నాలతో పేదరిక నిర్మూలన

ఎమ్మెల్యే కే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ అధికారంలోని వచ్చిన తర్వాత పేదక నిర్మూలకోసం నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని, కరోనా లాంటి కష్టకాలంలో సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ఆదరువుగా నిలిచాయని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెంలో సచివాయం-1 పరిధిలోని తూర్పు దళితవాడ, ఎస్సీబీసీ కాలనీ, రామ్మోహన్‌సెంటర్ ఎదుటి వీధుల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతూ సక్రమంగా అందుతున్నాయా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో తమ ప్రభుత్వానికి కులమత రాజకీయాలతో పనిలేదన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు వెంటనే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే తగిన చర్యలు తీసుకొని మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించడంతో పాటు ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. తూర్పు దళితవాడలో మంచినీటి సరఫరా చేయాలని, ఎస్సీ బీసీ కాలనీలో పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా కొనసాగించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కాలనీ గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. కాలనీల్లోని అంతర్గత రహదార్లలో మధ్యస్తంగా నిలిచిన సిమెంట్ రోడ్లను పూర్తిచేయాలని మరికొందరు విజ్ఞప్తి చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రజని, మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పట్టణశాఖ అధ్యక్షుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వార తోరణం నిర్మాణానికి భూమి పూజ



ముఖ ద్వార తోరణానికి భూమి పూజ చేస్తున్న మహేంద్ర దంపతులు

మేదూరు(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న గంపలగూడెం మండలం మేదూరులో విరాజిల్లుతున్న శ్రీ అంజనాద్రి వెంకటేశ్వరస్వామి ఆలయానికి దాత విరాళంతో నిర్మించనున్న ముఖ ద్వార తోరణానికి సోమవారం భూమి పూజ చేశారు. స్థానిక భ్రమరాంబ సహిత రామలింగేశ్వరస్వామి అర్చకులు బాదంపూడి శివరామలింగప్రసాద్ ఆధ్వర్యంలో గంపలగూడెంకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు కుందా మహేంద్ర, జలజ దంపతులు పూజలు చేశారు. ముఖ ద్వార తోరణానికి అవసరమైన రూ.3 లక్షలను మహేంద్ర అందజేస్తున్నారని ఆలయ అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు తెలిపారు. వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ ముత్యాల రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరం



నూజివీడు గ్రంథాలయంలో పిల్లలకు కథలు చెబుతున్న విద్యార్థిని

నూజివీడు: స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తకపఠనం, దీనిపై సమీక్ష చేశారు. ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులకు ఉపాధ్యాయిని ఎల్ స్వప్న అవగాహన కల్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఈమని శేషయ్య విద్యార్థులకు గ్రంథాలయాలు, పుస్తపఠనం వల్ల కలిగే లాభాలను వివరించారు. విద్యార్థులతో కథలు చెప్పించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

చేతి రాతపై శిక్షణ

చాట్రాయి: వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో సోమవారం విద్యార్థులకు చేతి రాత, డిక్టేషన్ వ్యాస రచన పోటీలు, గణితం, పుస్తక పఠనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారుల శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

నియమిత వేళల్లోనే మట్టి తోలాలి

ముసునూరు: ప్రభుత్వ అనుమతితో నియమిత వేళల్లోనే గ్రామ స్థాయి అధికారుల సమక్షంలో మట్టితోలకాలు నిర్వహించుకోవాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. గోపవరంలో ఆదివారం రాత్రి నుంచి అక్రమంగా మట్టి తోలకాలు నిర్వహిస్తున్నారంటూ గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేయడంతో క్షేత్ర పర్యటనలో ఉన్న సబ్ కలెక్టర్ సోమవారం సాయంత్రం గోపవరం వచ్చారు. తోలకాలు నిర్వహిస్తున్న వారి వద్ద అనుమతి పత్రాలను పరిశీలించారు. అన్నీ సక్రమంగా ఉండడంతో నిబంధనల ప్రకారం మాత్రమే మట్టి తోలుకోవాలని, సెలవు రోజుల్లో తోలకాలు వద్దని సూచించారు. అక్రమ మట్టి తోలకాల సంబంధించి ట్రాక్టర్ల నంబర్లు, ఫొటోలు వంటి ఆధారాలతో మాత్రమే ఫిర్యాదు చేయాలని ఫిర్యాదుదారుకు సూచించారు. ప్రభుత్వ అనుమతితో మట్టి తోలకాలు నిర్వహించినా గ్రామ స్థాయి అధికారుల సమక్షంలో లేదా పర్యవేక్షణలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దాసరి సుధను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ మాధవ సాయిరామ్, వీఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వట్టిగుడిపాడు మీదుగా బస్సు నడపండి

నూజివీడు: నూజివీడు – విజయవాడ మార్గంలో రామన్నగూడెం, వట్టిగుడిపాడు, ఈదులగూడెంల మీదుగా 308 సర్వీసులను నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం విజయవాడ గవర్నర్‌పేటకు చెందిన 208 బస్సు సర్వీసు ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తున్నప్పటికీ అది ఎప్పుడు రద్దుచేస్తున్నారో, ఎప్పుడు నడుపుతున్నారో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలో రామన్నగూడెం, పోలసానపల్లి, వట్టిగుడిపాడు, మల్లవల్లి అడ్డరోడ్డు, అనంతసాగారం, ఈదులగూడెం, సగ్గూరు అడ్డరోడ్డు, చొప్పరమెట్ల గ్రామాలున్నాయి. బస్సు సర్వీసు లేకపోవడంతో ప్రజలు నిత్యం ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆగిరిపల్లి వెళ్లాలన్నా, నూజివీడు రావాలన్నా ఆటోలే దిక్కుగా మారాయి. రహదారి సదుపాయం కూడా బాగున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు వెంటనే ఈ మార్గంలో 308 సర్వీసులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ జైన్‌కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా దిగువ పేర్కొన్న ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రోడ్, గొల్లపూడి డైమండ్స్ అపార్ట్‌మెంట్ ఏరియా, హైస్కూల్ ఏరియా, సీ అండ్ టీ టవర్స్ ఏరియా, టీటీడీసీ ఆఫీస్ ఏరియా వరకు ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెల్వడంలో..

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం సబ్ స్టేషన్ పరిధిలోని వెల్వడం, తోలుకోడు, కీర్తిరాయునిగూడెం గ్రామాలలో మంగళ వారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గణపవరం ఏఈ పర్వతనేని సాంబశివరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పిల్లలను పనులకు పంపొద్దు

గానుగపాడు(తిరువూరురూరల్): బడి ఈడు పిల్లలను పనులకు పంపవద్దని, విద్యాహక్కు చట్టం ప్రకారం వారు చదువుకునే హక్కు కలిగి ఉన్నారని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్ పేర్కొన్నారు. మండలంలోని గానుగపాడు, జీకొత్తూరు గ్రామాల్లో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నందున తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోటేశ్వరరావు

తిరువూరు: ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల యూనియన్ 327 యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంటుగా తిరువూరు సబ్ డివిజన్లోని పోలిశెట్టిపాడు లైన్‌మెన్ జీ కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. విజయవాడలో సోమవారం జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యుత్ ఉద్యోగుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. నూజివీడు డివిజన్ యూనియన్ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా మూడు పర్యాయాలు పనిచేశారు.

పరస్పర దాడులపై కేసులు

ముసునూరు: పాతకక్షల నేపథ్యంలో పరస్పరం భౌతిక, లైంగిక దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.కుటుంబరావు సోమవారం సాయంత్రం తెలిపారు. మండలంలోని కొర్లగుంట శివారు సింహాద్రి అప్పారావుపేటకు చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన రామకూరి అశోక్ సోమవారం అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని, అడ్డొచ్చిన తన చెల్లి, తమ్ముడుపై తన ప్రియురాలితో కలిసి భౌతిక దాడిచేసినట్లు పేర్కొన్నారు. దీనిపై బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే గ్రామానికి చెందిన మోజర్ల సరళ, చంద్రమ్మ, రామకూరి ఈశ్వర్ తనపై భౌతిక దాడి చేశారని చిన్నం ఇందిరాకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో టవర్‌లైన్ భూముల పరిశీలన



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లిలో ఏపీ ట్రాన్స్‌కో టవర్‌లైన్ భూమిని ఏపీఈఆర్సీ అధికారులు సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు సీహెచ్ వేణుగోపాలరావు సర్వే నంబర్ 41/1 భూమిలో ఏర్పాటు చేసిన టవర్‌కు సంబంధించి కొంతపరిహారం రావాల్సి ఉందని గతంలో ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ డి.రమణయ్యశెట్టి ఆ భూమిని, భూమి యాజమన్య హక్కులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ఉపాధి పనులకు 5,507 మంది కూలీలు



నూజివీడు: మండలంలోని 29 పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులకు సోమవారం 5,507 మంది కూలీలు హాజరయ్యారు. మండలంలోని గ్రామాల్లో చెరువుల్లో పూడికతీత, కాలువల మరమ్మతులు, ఫీడర్‌చానళ్లు, సప్లయ్ చానళ్లలో పూడికతీత పనులు, పంట కాలువల మరమ్మతులు, మట్టిరోడ్ల నిర్మాణం తదితర పనులను చేస్తున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనులు నిర్వహిస్తున్నారు. ఇటీవల వరకు రెండు పూటలా పనులు చేయగా, గత రెండు రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో ఉదయం 11 గంటల వరకు పనులు చేసి కూలీలు ఇళ్లకెళ్తున్నారు. ఎండతీవ్రత నుంచి రక్షణకు పని ప్రదేశంలో తాటాకు పందిళ్లను ఏర్పాటు చేశారు.

వడగాలులకు రాలుతున్న మామిడి కాయలు



నూజివీడు: రెండు రోజులుగా వీస్తోన్న వడగాలులతో మామిడి రైతాంగానికి తీరని నష్టం వాటిల్లుతోంది. మామిడి ధర లేకపోవడంతో 10 రోజుల తరువాతైనా ధర పెరుగుతుందేమోనని పలువురు రైతులు మామిడి కాయలు కోయకుండా చెట్లకే ఉంచారు. ఈ నెల 14వ తేదీ నుంచి వీస్తోన్న వడగాలులకు చెట్లకు ఉన్న మామిడి కాయలు పెద్ద ఎత్తున రాలిపోతున్నాయి. ఈ ఏడాది వాతావరణం కలిసిరాక, మార్కెట్‌లో ధర లేక మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

కూచిపూడి నృత్యానికి పూర్వవైభవం తేవాలి



వెంకటేశ్వరస్వామి ఆలయంలో గజ్జపూజ చేస్తున్న అర్చకుడు, బాలికలు

ఇబ్రహీంపట్నం: కూచిపూడి నృత్యానికి పూర్వవైభవం తీసుకు రావాలని ప్రముఖ నాట్యాచార్యులు నప్పా శివకుమార్ అన్నారు. స్థానిక ఏకాలనీ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గజ్జ పూజ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గజ్జలకు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అంతరించిపోతున్న కూచిపూడి కళను ప్రోత్సహించేందుకు గజ్జ పూజ చేసినట్లు తెలిపారు. గజ్జ పూజలో పాల్గొన్న విద్యార్థినులు వేదికపై నృత్య ప్రదర్శనలకు అర్హత పొందుతారన్నారు. కూచిపూడి కళపై ఆసక్తిగల బాలికలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: రైతులకు 50 శాతం రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీలుగ, జనుము, పిల్లిపెసర్లు విత్తనాలు రైతులకు సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్బీకేలో సంప్రదించాలని ఏఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు లోకేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, సర్పంచ్ నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, మాజీ వైస్ ఎంపీపీ దుర్గారావు పాల్గొన్నారు.

రెండు వేల పక్కాగృహాల మంజూరు



తిరువూరు మండల పరిషత్ సమావేశం

తిరువూరు: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కొత్తగా రెండు వేల పక్కాగృహాలు మంజూరైనట్లు ఎంపీపీ గద్దల భారతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. దీర్ఘకాలంగా పేదలు ఎదుర్కొంటున్న పక్కా గృహాల సమస్య పరిష్కారమవుతున్నట్లు తెలిపారు. ఇటీవల తిరువూరు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అందరికీ గృహనిర్మాణం చేసుకునే అవకాశం కల్పించారన్నారు. గ్రామాల్లో దెబ్బతిన్న రహదారుల నిర్మాణానికి, తాగునీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తహసీల్దారు సురేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదుకు స్పందన



కొత్తపేట కారం మిల్లు రోడ్డును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఈఈ బాపిరెడ్డి

ఆగిరిపల్లి: జగనన్నకు చెబుదాం ఫిర్యాదుకు అధికారులు స్పందించారు. ఆగిరిపల్లికి చెందిన కంబాల సరోజిని తాము కొత్తపేట కారం మిల్లు సమీపంలో నివసిస్తున్నామని, సీసీ రోడ్డు, డ్రెయినేజీ సౌకర్యం లేక ఇక్కట్లు పడుతున్నామని జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఆదివారం ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసింది. సోమవారం ఉదయం పంచాయతీరాజ్ ఈఈ బాపిరెడ్డి ఫిర్యాదు వచ్చిన ప్రాంతానికెళ్లి సందర్శించి, ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఇలా వచ్చి అడిగిన అధికారులు ఎవరూ లేరని సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే సాధ్యమైందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. పీఆర్ ఏఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

భానుడి భగభగ



గంపలగూడెంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి



నిర్మానుష్యంగా మారిన చనుబండ మెయిన్ రోడ్డు

ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలు

గంపలగూడెం: భానుడి భగభగలతో మండలంలోని ప్రజలు సోమవారం తల్లడిల్లిపోయారు. 45 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదు కావడంతో వేసవి ఎండల తీవ్రత తట్టుకోలేని పరిస్థితి ప్రజలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎంత తీవ్రతతో పాటు రోజంతా ఒడగాడ్పులు వీచడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో సాయింత్రం ఐదుగంటల వరకు గ్రామాల్లో వీధులు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. వ్యాపార కేంద్రాలైన గంపలగూడెం, తోటమూల, ఊటుకూరు గ్రామాలలో సైతం ప్రధాన వీధులు జన సంచారం లేక బోసిపోయాయి. అత్యవసర పని ఉన్నవారు మినహా మిగతా ఎవరు బయట తిరిగేందుకు సాహసించలేదు. పశువుల సైతం ఎండలకు అల్లాడిపోయాయి.

మండుతున్న ఎండలు

చాట్రాయి: మండుతోన్న ఎండలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలతో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం తొమ్మిది గంటలకే వేడి గాలులు వీస్తున్నాయి. ఉపాధి హామీ కూలీలు తొమ్మిది గంటలకే ఇంటి ముఖం పడుతున్నారు. 11 గంటల్లోపు ప్రజలు తమ ప్రయాణాలను ముగిస్తున్నారు. కొనుగోలుదారులు రాకపోవడంతో వ్యాపార సంస్థలు మూసివేస్తున్నారు. 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

డెంగీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, వ్యాధి నివారణకు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరపాలకసంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణా కార్యక్రమంలో భాగంగా డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించే ప్రచార వాల్ పోస్టర్లను అధికారులతో కలిసి విడుదల చేశారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి ఆడ ఈడిస్ దోమ కాటుతో వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు, చర్మంపై దద్దుర్లు వంటివి డెంగీ వ్యాధి లక్షణాలు అని చెప్పారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడడం ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు. అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుని వ్యాధి రాకుండా రక్షణ పొందాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి అడ్మిషన్లు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు జూన్ 6వ తేదీ లోపుగా ఐటీఐ.ఏపీ.జీవో.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసేటప్పుడు ఏవిధమైన తప్పులు లేకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులో వివరాలు సక్రమంగా లేకపోతే అడ్మిషన్ పొందుటకు అర్హత ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఇతర వివరాలకు విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్వయంగా కానీ 94906 39639, 77804 29468 నంబర్లలో సంప్రదించాలని కోరారు.